

కన్నీటి సాగు..

ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలకు పంటలన్నీ నీట మునిగాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 8లో▸



కమ్మేస్తున్న కంపచెట్లు

కొడంగల్ చెరువు నిండుకుండలా మారింది. ఇందులో ముళ్లకంపలు ఏపుగా పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 9లో▸



తల్లిపాలు అమృతం

'తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపాలని సీడీపీఓ కాంతారావు సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

బీజేపీవి కుట్రపూరిత రాజకీయాలు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని, వారెన్ని చేసినా చివరకు ధర్మమే గెలుస్తుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీపై బీజేపీ తప్పుడు కేసు బనాయించడంపై సుప్రీం కోర్టు స్టే విధించడంతో శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతున్న రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడనే అక్కసుతో అక్రమ కేసులు బనాయించి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపపెట్టు అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే భయంతో తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏ కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు రాములు, శ్రీనివాస్, రియాజ్, యోజన్,ఆనంద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

సాక్షి ఎఫెక్ట్..

వికారాబాద్: 'నకి'లీలలు శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి శనివారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ స్పందించారు. వానాకాలం సీజన్ ప్రారంభం నుంచే నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 344 శాంపిల్స్ తీసుకుంటే 17 విత్తన శాంపిల్స్‌లో ఉండాల్సిన నాణ్యత ప్రమాణాలకు తగ్గ లేకపోవడంతో 14 మందిపై ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిగతా ముగ్గురిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో విడిగా నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల బారిన జనం



వైద్యం కోసం వచ్చిన జనం

వికారాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధుల కారణంగా వికారాబాద్ ఏరియా ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. నాలుగైదు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో ఎక్కువ మంది వస్తున్నట్లు ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. అయితే 80శాతం మందికి సాధారణ జ్వరమేనని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటివి ప్రబలినా మందులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సోమవారం ఓపీకి 515మంది రాగా, మంగళవారం 462మంది, బుధవారం 493 మంది, గురువారం 406మంది, శుక్రవారం 503 మంది వైద్యం కోసం వచ్చారు.

వీఆర్‌ఏలకు శాఖల కేటాయింపు

వికారాబాద్ అర్బన్: ఇటీవల సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు ఇతర శాఖల్లో వీఆర్‌ఏల విలీనం చకచకా సాగుతోంది. విద్యా అర్హతలను బట్టి జిల్లాలోని 360 మంది వీఆర్‌ఏలను ఆరు శాఖలకు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీఓ విడుదల చేసింది. 10వ తరగతి, ఆ లోపు అర్హత ఉన్న వీఆర్‌ఏలను మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖల్లో, ఇంటర్ అర్హత ఉన్న వారిని రెవెన్యూ కార్యాలయంలో సబార్డినేటర్లుగా, డిగ్రీ ఆపై అర్హతలు ఉన్న వారికి రెవెన్యూ, మున్సిపాలిటీల్లో పోస్టులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు 77మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, మున్సిపల్ వార్డు ఆఫీసర్లుగా 25మందిని, రెవెన్యూ శాఖలో రికార్డు అసిస్టెంట్‌గా 67మందిని, ఆఫీస్ సబార్డినేటర్లుగా ఆరుగురిని, చైన్ మ్యాన్లుగా 17మందిని, ఇరిగేషన్ శాఖకు 47 లస్కర్ పోస్టులు, ఒకరిని హెల్పర్‌గా, మిషన్ భగీరథకు 120మందిని కేటాయించారు. ఒకటి రెండు రోజుల్లో వారికి కలెక్టర్ పోస్టింగులు ఇవ్వనున్నారు.

ఈసారీ సర్దుబాటే!



జిల్లాలో 115మంది ఉపాధ్యాయులకు డిప్యూటేషన్

- బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో టీచర్ల కొరత
- 235 పోస్టులు ఖాళీ
- బోధనపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

వికారాబాద్ అర్బన్: సర్కారు స్కూళ్లల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పాఠశాలల్లో వసతులు, సదుపాయాలు బాగుండడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పించారు. ఈ ఏడాది పాఠ్య పుస్తకాలతో పాటు, నోటు పుస్తకాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో రాగి జావ అందిస్తున్నారు. అంతేకాకుండా ఉత్తీర్ణత శాతం కూడా మెరుగు పడడంతో సర్కారు బడులపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోంది. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా కొన్ని స్కూళ్లల్లో సబ్జెక్టుల టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ సారి కూడా విద్యాశాఖ సర్దుబాటు (డిప్యూటేషన్) పేరుతో సమస్యను కొంత తగ్గించే ప్రయత్నం చేస్తోంది. డీఈఓ ఆదేశాలతో ఎంఈఓలు ఆయా మండలాల్లో అవసరమైన సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల జాబితాను పంపారు. దాని ఆధారంగా డీఈఓ రేణుకాదేవి 105మంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వేశారు. ఇప్పటి వరకు 91మంది విధుల్లో చేరగా మరో 14మంది కేటాయించిన పాఠశాలలకు వెళ్లలేదు. వీరు కూడా పాఠశాలల్లో చేరేలా ఎంఈవోలు చొరవ తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు	
ఇంగ్లిష్	69
సోషల్	61
బయాలజీ	62
లాంగ్వేజ్ పండిట్	43

235 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు

జిల్లాలో 1,054 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 92వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యా యులు లేక బోధన కష్టంగా మారింది. జిల్లాలో ప్రస్తుతం 3,055 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా (ఎస్జీటీలు కాకుండా), 235 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యధికంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులే ఖాళీగా ఉన్నాయి. దీంతో హైస్కూల్ విద్యార్థులకు నష్టం జరుగుతోంది. ప్రధానంగా ఇంగ్లిష్, సోషల్, సైన్స్ బోధించే ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది.

పనిచేస్తున్న మండలంలోనే డిప్యూటేషన్

ఉపాధ్యాయులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో డీఈఓ వారు పనిచేస్తున్న మండలాల్లోనే డిప్యూటేషన్లు కల్పిస్తున్నారు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ వంటి మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న 70శాతం మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరు సెలవు పెట్టిన రోజు పాఠశాలలు నిర్వహించడం కష్టంగా మారుతోంది. ప్రస్తుతం విద్యా వలంటీర్ల వ్యవస్థ కూడా లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. దీంతో పాటు జిల్లాలో 169 పాఠశాలల్లో సింగిల్ టీచర్లు ఉన్నారు. వీరు సెలవు పెడితే ఆ రోజు పాఠశాలకు తాళమే.. మధ్యాహ్న భోజనం పెట్టడం కూడా పెద్ద సవాలే. ఇలా ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



సబ్జెక్టుల వారీగా ఎక్కడ ఖాళీలు ఉన్నాయో గుర్తించి, అక్కడికి ఉపాధ్యాయులను పంపుతున్నాం. అయితే ఎస్జీటీలను పంపితే విద్యార్థులకు సబ్జెక్టు పరంగా న్యాయం జరగదు. అందుకే ఉపాధ్యాయుల పనిచేస్తున్న మండలంలోనే స్కూల్ అసిస్టెంట్లను పంపుతున్నాం. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో కొంత సమస్య ఉంది. అయినా ఎంఈఓలు, ఆ మండలాల్లో పనిచేసే ఉపాధ్యాయుల సహకారంతో ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. రెండు మూడు రోజుల్లో డిప్యూటేషన్ వేసిన ఉపాధ్యాయులంతా విధుల్లో చేరుతారు.

– రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్

మద్యం పాలసీ కొలిక్కి

- టెండర్ ప్రక్రియ ప్రారంభం
- లాటరీ పద్ధతిన రిజర్వేషన్ల కేటాయింపు
- కసరత్తు పూర్తి చేసిన ఎక్సైజ్ శాఖ
- 18 వరకు దరఖాస్తుల స్వీకరణ



మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్(ఫైల్)

వికారాబాద్: కొత్త మద్యం పాలసీని ప్రభుత్వం ఖరారు చేసిన నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు అందుకు అనుగుణంగా దుకాణాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. నవంబర్ నెలాఖరులోగా పాత దుకాణాల గడువు ముగుస్తుండడంతో ఈ సారి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని నాలుగు నెలల ముందే ఖరారు చేసింది. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఇందులో సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో గౌడ కులస్తులకు గతేడాది లాగే రిజర్వేషన్లు అమలు చేయనుంది. దరఖాస్తు ఫీజుతో పాటు స్లాబ్‌లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. జిల్లాలో గతేడాది 13 కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు కాగా వాటి సంఖ్య 59కి చేరింది. ఈ ఏడాది వాటికే దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రభుత్వ విధి విధానాల ప్రకారం జిల్లాలో ఎస్సీలకు తొమ్మిది, గౌడలకు ఆరు, ఎస్టీలకు రెండు పోను మిగతా 42 దుకాణాలకు ఓపెన్ కేటగిరి కింద దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా 18వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే కలెక్టర్ లాటరీ పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు చేశారు.

నిబంధనలు ఇవే..

మద్యం దుకాణాల ఏర్పాటులో ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. దుకాణం ముందు పార్కింగ్ స్థలం ఉండాలి. ప్రతి షాపు ముందు మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మైనర్లకు మద్యం విక్రయించరాదు. దుకాణాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.

రిజర్వ్‌డ్ దుకాణాలు ఇవే..

గౌడ కులస్తులకు: మోమిన్‌పేట, మర్పల్లి, ధారూరు, కుల్కచర్ల, దౌల్తాబాద్, తాండూరులో ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.

ఎస్సీలకు: వికారాబాద్, నవాబుపేట, కొడంగల్, దౌల్తాబాద్, పెద్దేముల్, యాలాలలో ఒక్కొక్కటి చొప్పున రిజర్వ్ చేశారు. పరిగి మున్సిపల్ పరిధిలో ఎస్సీలకు మూడు రిజర్వ్ చేశారు.

ఎస్టీలకు: పరిగి మున్సిపల్ పరిధిలో ఒకటి, కుల్కచర్లలో ఒకటి రిజర్వ్ చేశారు. వికారాబాద్ సర్కిల్‌లో 15 మద్యం దుకాణాలు, పరిగి సర్కిల్‌లో 12, తాండూరు సర్కిల్‌లో 18,మోమిన్‌పేట సర్కిల్‌లో 6, కొడంగల్ సర్కిల్‌లో 8 మద్యం దుకాణాలు ఉన్నాయి.

'ధరణి' పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ హరీశ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల విషయంలో జాప్యం వహించకుండా, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ హరీశ్ తహసీల్దార్లకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్డీఓలు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన తహసీల్దార్లంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులతో పాటు ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సక్సెషన్ దరఖాస్తులు, పెండింగ్ మ్యూటేషన్లకు సంబంధించి వందశాతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తరువాతే పరిష్కరించాలని ఆదేశించారు. మీ–సేవకు సంబంధించిన జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేయాలన్నారు. డబల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తులు, కల్యాణ లక్ష్మి/షాదీముబారక్ దరఖాస్తులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని కోరారు. ఎన్నికల అంశానికి సంబంధించి బీఎల్ఓ లాగిన్‌పై దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటర్ జాబితాలో ఇంకా పరిశీలించని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈఆర్‌ఓలు సాధరణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అర్హులైన ఓటర్లందరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారంతా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటు నమోదు, మార్పులు చేర్పులు చేసే విధంగా ఫామ్ 6,7,8లను వెంటనే పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్న ఐదుగురు ముఠా సభ్యుల గుట్టును పోలీసులు రట్టు చేశారు. వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ శుక్రవారం వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన పెరుమాళ్ల రజనీకాంత్ (22) డ్రగ్స్‌కు బానిసై పలు నేరాలకు పాల్పడ్డాడు. ఇతనికి సోషల్ నెట్‌వర్కింగ్ నిర్వహించే మాదాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ సమీర్‌తో పరిచయం ఏర్పడింది. జల్సాలకు అలవాటు పడిన వీరిద్దరూ సుల భంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో కాలేజీ, స్కూల్ విద్యార్థులకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ప్రణాళిక అమలు చేయడానికి వనస్థలిపురంలోని రైతుబజారు వద్ద ఓ కానిస్టేబుల్ పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతానికి వెళ్లి ఐదు కిలోల గంజాయి తీసుకువస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం పోలీసులు సంయుక్తంగా మాటు వేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరినీ అదు పులోకి తీసుకుని విచారించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని వివిధ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న ఉట్కూరి సాత్విక్‌రెడ్డి, తోడేటి వంశీ, గాడిపల్లి హేమంత్ కొనుగోలు చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారని చెప్పడంతో వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు కిలోల గంజాయి, ఓ ద్విచక్ర వాహనం,నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.పరారీలో ఉన్న ఒడిశాలోని మరో నిందితుడు తిరుపతి కోసం గాలిస్తున్నారు.

పిల్లల కార్యకలాపాలపై నిఘా పెట్టాలి

ఇటీవలి కాలంలో అనేక మంది యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయని.. ఇలాంటి వాటిని అరికట్టి డ్రగ్స్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంతో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీ చౌహాన్ పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. సంఘవిద్రోహ చర్యలను అరికట్టేందుకు యువత సంకోచించకుండా పోలీసులను ఆశ్రయించాలని విజ్ఞప్తి చేశారు.

నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

బషీరాబాద్: కంప్యూటర్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజులుగా భూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు రోజూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ నెల 2న కంప్యూటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. మరమ్మతుల నిమిత్తం కలెక్టరేట్‌కు పంపారు.

వానలోనూ మంటలే..!

శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో 515 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గత నెల 21న అర్ధరాత్రి అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. భారీ వర్షానికి తోడు అప్పటికే విద్యార్థునులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా మంటలు రావడంతో బయటికి పరుగులు తీశారు. ఆ రోజంతా వారికి సమీపంలోని పోలీసు స్టేషన్‌లోనే ఆశ్రయం కల్పించాల్సి వచ్చింది.

రాజేంద్రనగర్ పరిధిలోని హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఇబ్రహీం పాత దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. ఎప్పటి మాదిరే మంగళవారం రాత్రి గోదాం ప్రధాన గేటుకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం తెల్లవారు జామున గోదాంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్పటికే నిల్వ చేసిన దుస్తులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగింది.



ఇటీవల హసన్‌నగర్‌లో జరిగిన ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వర్షాకాలంలోనూ అగ్ని ప్రమాదాలు

- పాత, నాసిరకం కేబుళ్లతోనే ప్రమాదాలు
- విలువైన ఆస్తి బుగ్గిపాలు
- గృహ వినియోగదారులు, వ్యాపారులకు తీవ్ర నష్టం
- మానవ తప్పిదాలతోనే అంటున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వేసవితో పోలిస్తే ప్రస్తుతం గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగం తక్కువే. ప్రస్తుతం ఆయా సముదాయాల్లోని ఏసీలన్నీ దాదాపు స్విచ్ఛాఫ్ చేసి ఉంటాయి. సర్వీసు వైరు సహా అంతర్గత విద్యుత్ కేబుళ్లపై పెద్దగా భారం కూడా ఉండదు. అయినా షార్ట్‌సర్క్యూట్‌లు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో కొన్ని ప్రమాదాలు వెలుగు చూస్తుండగా..మానవ తప్పిదాలతో మరికొన్ని ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఫలితంగా విలువైన ఆస్తి బుగ్గిపాలవుతూ.. గృహ వినియోగదారులతో పాటు వ్యాపారులు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. రాజేంద్రనగర్, శంషాబాద్, అత్తాపూర్, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, తుర్క యంజాల్, తుక్కుగూడ, ఎల్బీనగర్, తదితర ప్రాంతాల్లో ఫర్నిచర్, వస్త్ర, ప్లాస్టిక్ గోదాములు భారీగా వెలిశాయి. నిర్వాహకులకు విద్యుత్‌పై సరైన అవగాహన లేకపోవడంతో తక్కువ సామర్థ్యం ఉన్న నాసిరకం వైర్లు వాడుతున్నారు. వాటికి అనేక జాయింట్లు ఉండటం, వర్షపు నీరు వాటిమధ్యలోకి చేరి షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. షార్ట్‌స ర్క్యూట్ తలెత్తిన వెంటనే విద్యుత్ సరఫరా నియంత్రించే పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది.

మెజార్టీ ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే..

జిల్లాలో వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. మెజార్టీ సంస్థలు బహుళ అంతస్తుల భవనాల్లోనే ఏర్పాటవుతున్నా యి. భవన యజమానులు నిర్మాణ పనులను బిల్డర్లకు అప్పగిస్తున్నారు. వీరు నిర్మాణ సమయంలో ఖర్చు తగ్గించుకుని, ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందాలని భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా తాత్కాలికంగా మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం సర్వీసువైర్లు, కేబుళ్లు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. భవన యజమానులకు ఈ విద్యుత్ సరఫరా వ్యవస్థపై పెద్దగా అవగాహన లేకపోవడం కూడా వీరికి కలిసి వస్తోంది. తీరా నిర్మాణాలు పూర్తయి.. భవనం వినియోగంలోకి వచ్చిన తర్వాత వాటిని కొనుగోలు చేసిన వారు, అద్దెకు దిగిన వారు వైర్ల సామర్థ్యానికి మించి విద్యుత్ వాడుతున్నారు. ఏసీ, రిఫ్రిజిరేటర్, గ్రీజర్, కంప్యూటర్, ఓవెన్ సహా ఇతర గృహోపకరణాలన్నీ వినియోగిస్తున్నారు. ఇందుకు మల్టీపుల్ సాకెట్లను వినియోగిస్తున్నారు. సర్వీసు వైరు సహా ఇతర కేబుళ్ల సామర్థ్యానికి మించి విద్యుత్ లోడును వినియోగిస్తుండటంతో గోడల లోపల ఉన్న విద్యుత్ వైర్లు హీటెక్కిపోతున్నాయి. జాయింట్ల వద్ద స్పార్క్‌లు తలెత్తుతున్నాయి. స్పార్కులతో ఎగిసిపడిన అగ్నికీలలు పక్కనే ఉన్న సున్నితమైన వస్తువులపై పడి సులభంగా మంటలు వ్యాపిస్తున్నాయి. ఏకధాటి వర్షాలకు పాత గోడలు జాలువారి వర్షపు నీరు ఆ జాయింట్ల మధ్యకు చేరి షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతోంది. భగవంతుడి కోసం వెలిగించిన దీపాలు కూడా ప్రమాదాలకు మరో కారణంగా భావిస్తున్నారు. కొంతమంది దుకాణాలు మూసే సమయంలో దేవుడి ఫొటోల ముందు దీపాలు వెలిగిస్తుంటారు. దీపపు కుందుల్లోని నూనె పూర్తిగా కాలిపోయిన తర్వాత అందులోని ఒత్తులు కిందపడి అగ్నిప్రమాదాలకు కారణమవుతోంది. ఈ మానవ తప్పిదాలను కూడా షార్ట్‌సర్క్యూట్‌ల జాబితాలో చేర్చుతున్నారు.

ఆర్‌సీసీబీలు ఏర్పాటు చేసుకోవాలి



భవిష్యత్తు అవసరాలు గుర్తించి ఈ మేరకు సర్వీసు (6 స్క్వేర్ ఎంఎం) వైరుతో పాటు అంతర్గత కేబుళ్ల (4 స్క్వేర్ ఎంఎం వైర్లు), ఐఏఎస్ఓ ప్రమాణాల మేరకు తయారు చేసిన నాణ్యమైన స్విచ్‌బోర్డులు, సాకెట్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ లైసెన్సు పొందిన కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలి. ప్రమాదవశాత్తు తలెత్తే షార్ట్ సర్క్యూట్‌ను నియంత్రించేందుకు అవసరమైన రిసిడ్యూయల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్ (ఆర్‌సీసీబీ) ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి పదిహేనేళ్లకు ఒకసారి విద్యుత్ వైర్లను మార్చుకోవాలి. జాయింట్లను సరి చేసుకోవాలి. మల్టీపుల్ సాకేట్లు వినియోగించకుండా చూసుకోవడం ద్వారా ప్రమాదాలను నియంత్రించొచ్చు.

– టి.కాంతారావు, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి

కొత్త జీపీలు ఏర్పాటు చేయండి

శాసనసభలో ఎమ్మెల్యే ఆనంద్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ శుక్రవారం శాసనసభ సమావేశాల్లో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. బంట్వారం మండలంలోని మంగ్రాస్‌పల్లి, కోట్‌పల్లి పరిధిలోని కంకణాలపల్లితండా, మదుగులతండా, నాగసాన్‌పల్లితండా, మోమిన్‌పేట మండలం రావులపల్లి, మర్పల్లి మండలంలోని రాంపూర్, కూడుకుంట, ధారూరు మండలం లక్ష్మీనగర్‌తండా, తిమ్మానగర్, కొత్త తండా, డీకేతండా, కొండాపూర్‌కుర్దును ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని కోరారు.

క్లుప్తంగా

దుద్యాల సర్పంచ్‌కు స్టే

బొంరాస్‌పేట: నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కుంటున్న దుద్యాల సర్పంచ్ మహ్మద్ ఖాజాకు కోర్టు నుంచి స్టే లభించింది. జిల్లా పంచాయతీ అధికారులు సర్పంచ్ ఖాజా, ఉపసర్పంచ్ నవనీత, జూనియర్ పంచాయతీ కార్యదర్శి జైపాల్‌ను విచారించేందుకు షోకాజు నోటీసులిచ్చారు. మార్చి నుంచి మేరకు ఫిర్యాదులు, సంజాయిషీలు, విచారణలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో జూలైలో వీరి ముగ్గురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షోకాజు నోటీసులు ఇచ్చారు. తాను ప్రతిపక్ష నాయకుడినని బీఆర్ఎస్ నేతలు కక్ష పూరితంగా వ్యవహరించారంటూ సర్పంచ్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆయనకు కోర్టు నుంచి స్టే లభించింది.

ప్రతీ నెల సంతకం తప్పనిసరి

ఎస్‌ఐ కాశీనాథ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ కాశీనాథ్

పెద్దేముల్: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పెద్దేముల్ పీఎస్‌లో రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కాశీనాథ్, సిబ్బంది మాట్లాడుతూ ప్రతీ నెల 1న తప్పకుండా స్టేషన్‌కు హాజరై సంతకాలు చేయాలన్నారు. సత్ప్రవర్తనతో ఉండాలని చెప్పారు. షీట్‌లో ఉన్నవారు మరోసారి నేరాల్లో పాలుపంచుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షీట్‌లో ఉన్నవారిపై పదేళ్లపాటు కేసు నమోదుకాకుంటే వారిపై ఓపెన్ చేసిన షీట్‌ను క్లోజ్ చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపిస్తామన్నారు.

ట'మాట' రావట్లే..!



బషీరాబాద్: టమాటా ధర వింటే నోట మాట రావడం లేదు. బషీరాబాద్‌లో శుక్రవారం కిలో టమాటా ధర రూ. 200 పలికింది. కిలోకి 10నుంచి 12 టమాటాలు వచ్చాయని, ఒక్కొక్కటి రూ. 17నుంచి 20 రూపాయలకు వరకు పడుతున్నట్లు సామాన్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లెక్కన ఒక్క టమాటాతో మూడు కోడిగుడ్లు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఏది ఏమైనా టమాటాలు కొనాలంటేనే సామాన్యులు హడలి పోతున్నారు.

'చలో అసెంబ్లీ' నేపథ్యంలో ముందస్తు అరెస్టులు



పోలీసుల అదుపులో సెకండ్ ఏఎన్‌ఎంలు

కొడంగల్ రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫస్ట్ ఏఎన్‌ఎం చేసే విధులను తాము నిర్వహిస్తున్నా.. వేతనాలలో మార్పు ఎందుకని ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సెకండ్ ఏఎన్‌ఎంలు అనురాధ, మణెమ్మ ఉన్నారు.

కన్నీటి సాగు

- నిండా ముంచిన వరదలు
- దిక్కుతోచని కర్షకులు



చెరువు నీటితో నిండిన శిఖం భూమిలోని పొలాలు

బొంరాస్‌పేట: ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలకు వాగులు, వంకల్లో వరద పరవళ్లు తొక్కుతూనే ఉంది. జలాశయాలు నిండుకుండలా మారి, అలుగుపోస్తున్నాయి. వరద ఉధృతికి ఉమ్మడి బొంరాస్‌పేట మండల(బొంరాస్‌పేట, దుద్యాల) పరిధి గ్రామాల్లో ఆయకట్టు పొలాలతో పాటు చెరువుల చుట్టూ ఉన్న సాగుభూములన్నీ వర్షపునీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి.

తగ్గనున్న దిగుబడి!

ఏర్పుమళ్ల కాకర్‌వాణి ప్రాజెక్టు, దుద్యాల పెద్ద చెర్వు, బొంరాస్‌పేట, బురాన్‌పూర్‌తో పాటు 13 నోటిఫైడ్ చెరువులు, మరో 50వరకు చిన్న చెరువులు, కుంటలున్నాయి. ఇందులో అధికారుల లెక్కల ప్రకారం 5,012 ఎకరాలు (సుమారు 2వేల హెక్టార్లు) ఆయకట్టు ఉంది. ఇందులో యేటా వర్షాకాలంలో హెక్టారుకు 200బస్తాల చొప్పున 4.66లక్షల బస్తాల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతుండగా.. వాటి చుట్టూ ఉన్న పంట పొలాలు నీటమునిగాయి. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆదుకోవాలి



మా పొలం బాపన్‌చెర్వు శిఖంకు ఆనుకొని ఉంది. రెండు ఎకరాల పొలం ప్రస్తుతం వరద మంపులో ఉంది. వానాకాలం సాగుతో 80బస్తాల వరకు దిగుబడి వచ్చి, రూ.50 వేల వరకు ఆదాయం వస్తుంది. నిన్నమొన్నటి వానలకు నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– హన్మంతు చౌహాన్, రైతు, మూడుమామిళ్లతండా

ప్రభావిత పొలాలపై దృష్టి



వరద బాధిత పంట నష్టంపై ఉన్నతాధికారులు, లేదా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం, సూచనలు లేవు. శిఖానికి దగ్గరలో ఉండి, పంటసాగుకు ఇబ్బందిగా ఉన్న పొలాల సమాచారం ఏఈఓల ద్వారా రావాలి. ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్

బయోమెట్రిక్‌తో ఓపీ

- ఆధార్ నంబర్‌తో రిజిస్ట్రేషన్, వివరాల సేకరణ
- వారం రోజులుగా అమలు



వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలో రోగుల నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలంటే ఇక నుంచి ఆధార్ నంబర్ తప్పనిసరి. ఔట్ పేషెంట్‌లో వైద్య సేవలు పొందాలనుకునే రోగులు రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఆధార్ నంబర్ చెప్పి బయోమెట్రిక్ యంత్రంలో వేలు పెడితే రోగి వివరాలు, చిరునామా ప్రత్యక్షమవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ఓపీ రోగుల సంఖ్య ఇక నుంచి పక్కాగా నమోదు కానుంది. గతంలో రోజు వారి ఓపీ వివరాలను ఓ రిజిస్టర్‌లో రాసి, బాధితుడి ఆరోగ్య సమస్యలను బట్టి ఫలానా డాక్టర్‌ను కలవాలని ప్రిస్క్రిప్షన్ ఇచ్చేవారు. కొన్ని సార్లు అక్కడి సిబ్బంది ఓపీ సంఖ్యను ఎక్కువ చేసి చెప్పిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మాన్యువల్‌గా తీసుకునే ఓపీ వివరాలను ప్రతీ రోజు ఉన్నతాధికురాలకు పంపించాలంటే సిబ్బందికి సైతం ఇబ్బందులు తలెత్తేవి. ఈ ఇబ్బందులను తొలగించడంతో పాటు, రోజు వారీగా ఓపీ సేవలు ఎంతమంది పొందుతున్నారనే విషయం తెలుసుకునేందుకు వైద్య ఆరోగ్యశాఖ బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ చీటీ పొందాలంటే పేషెంట్ పేరు, ఊరు, ఆధార్ నెంబర్ తప్పకుండా చెప్పాల్సిందే. వెంటనే బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా పూర్తి వివరాలు నమోదు చేస్తుండటంతో ఓపీ సేవలపై నజర్ వేసేందుకు అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు. ఈ బయోమెట్రిక్ విధానం ప్రారంభమై వారం రోజులే కావడంతో ఈ సమాచారం తెలియక చాలా మంది ఆధార్ కార్డు లేకుండానే ఓపీ సేవలకు వస్తున్నారు. ప్రస్తుతం ఆధార్ నెంబర్ చెప్పని వారి వివరాలు నమోదు చేసుకుని ప్రిస్క్రిప్షన్ ఇస్తున్నారు. రెండోసారి ఆస్పత్రికి వచ్చేటప్పుడు తప్పకుండా ఆధార్ నెంబర్ తీసుకురావాలని సిబ్బంది రోగులకు సూచిస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరికి రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



పట్టుకున్న గంజాయి

మోమిన్‌పేట: నిషేధిత గంజాయిని అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం సిద్దాపూర్ శ్రీకృష్ణ కాలనీకి చెందిన బోయిని మురళీమోహన్(27) రెండేళ్లుగా కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి ఐదు గ్రాముల గంజాయి ప్యాకెట్లను తీసుకువచ్చి మోమిన్‌పేట పరిసర గ్రామాల్లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 133 ప్యాకెట్లను తీసుకువచ్చి నూతన బస్టాండు ప్రాంతంలో అమ్ముతుండగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి మురళీమోహన్‌ను అదుపులోకి తీసుకొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పండ్లవ్యాపారి వద్ద..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం సుభాష్‌నగర్‌లో గంజాయి అమ్మేందుకు యత్నిస్తున్న పండ్ల వ్యాపారిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వికారాబాద్ సీఐ శ్రీను తెలిపిన ప్రకారం.. పట్టణంలో పండ్ల వ్యాపారం చేసే అబ్రార్ శుక్రవారం కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి రైలు మార్గంలో వికారాబాద్ చేరుకున్నాడు. శైలజాటాకీస్ సమీపంలో ఆ గంజాయిని అమ్మేందుకు యత్నించగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ సీఐ వెంకటేశం, వికారాబాద్ సీఐ శ్రీను తమ సిబ్బందితో కలిసి అబ్రార్‌ను పట్టుకున్నారు. నిందితుడి వద్ద రూ.40వేల విలువైన రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

తప్పులకు తావివ్వద్దు

- పంట వివరాల సక్రమంగా నమోదు చేయాలి
- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



బూచన్‌పల్లిలో పెసర పంటను పరిశీలిస్తున్న గోపాల్, నీరజ

మర్పల్లి: ఈ ఏడాది వానాకాలంలో రైతులు సాగు చేసిన పంట వివరాలు సక్రమంగా ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ ఏఈఓ నీరజను ఆదేశించారు. శుక్రవారం ఆయన మర్పల్లి రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని బూచన్‌పల్లిలో రైతులు సాగు చేసిన పత్తి, పెసర, మినుము, కంది, సోయాబీన్ పంటలను పరిశీలించారు. ఏఈఓ నీరజ రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తీరుని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో లోతట్టు పొలాల్లో పంటలు పాడయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు పాడైన పంటల వివరాలను సేకరిస్తే తాను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానన్నారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగుపై పలు సూచనలు ఇచ్చాడు.

'పల్లె ప్రగతి' పనులు భేష్

అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్



నందుపల్లిలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మహేశ్వరం: మండల పరిధిలోని నందుపల్లి పంచాయతీలోని పల్లె ప్రకృతివనం, పంచాయతీ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం సందర్శించారు. గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డు, ట్రాక్టర్, ట్యాంకర్‌తో పాటు నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. పంచాయతీ రికార్డులు, ఇప్పటి వరకు విడుదలైన నిధులు, జరిగిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల రెగ్యులర్ అంశం గురించి పంచాయతీ కార్యదర్శుల వివరాలు,వారి పనితనం గురించి ఎంపీడీఓ, ఎంపీఓలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అభివృద్ధి, పల్లె ప్రగతి పనులపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



సీతక్కతో ప్రజావాయిస్ ప్రతినిధులు

అనంతగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు ములుగు జిల్లాలో ప్రజలు ముంపునకు గురయ్యారు. దీంతో ములుగు ఎమ్మెల్యే సీతక్క అందజేస్తున్న సాయానికి వికారాబాద్‌కు చెందిన పబ్లిక్ వాయిస్ ఫోరం ప్రతినిధులు స్పందించారు. వారి కుటుంబాల సహాయార్థం రూ.1,24,974 నిధులు సేకరించారు. ఈ నగదును శుక్రవారం ప్రజావాయిస్ ప్రతినిధులు ఎమ్మెల్యే సీతక్కకు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క వారిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

పాల్గొన్న మాజీ మంత్రులు ఎ.చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్



ప్రార్థనల్లో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మర్పల్లి: 42వ ఉర్స్ షరీఫ్ హజరత్ సయ్యద్ హుసేన్ పటేల్ బనిహాశం ఖాద్రీ జాతర ఉత్సవాలను శుక్రవారం దర్గా కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం దర్గాలో ప్రత్యేక నమాజ్ అనంతరం రాత్రి 8 గంటల ప్రాంతంలో భక్తులు దీపాలు వెలిగించారు. అనంతరం మహబూబ్ సుభాని దర్గా నుంచి ఉర్స్ షరీఫ్ హజరత్ సయ్యద్ హుసేన్ పటేల్ బనిహాశం ఖాద్రీ దర్గా వరకు కువకులు ఊరేగింపుతో గంధం తీసుకు వచ్చారు. ఈ ఉత్సవాలలో మాజీ మంత్రులు డాక్టర్ ఎ.చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారిని దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువారం, శుక్రవారం రాత్రి నిర్వహించిన ఖవాలి పాటలు భక్తులను ఆకట్టున్నాయి. ఈ జాతర ఉత్సవాల సందర్భంగా దర్గా కమిటీ చైర్మన్ సర్పంచ్ మైమూదాబీ, దర్గా కమిటీ సభ్యులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుభాష్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్, డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తా, దర్గా కమిటీ సభ్యులు ఖలీమోద్దీన్, సలీం, జాఫర్, ఖలీల్, గఫార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, టిప్పర్ ఢీకొని ఒకరు మృతి

మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో, టిప్పర్

ఇబ్రహీంపట్నం: టిప్పర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంగులూర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 12 సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న టిప్పర్, ఆటోలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సూర్యాపేటకు చెందిన ప్రకాశ్(20) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. లేబర్ పనిపై ఆదిభట్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆటోలోని ప్రయాణికులు హయత్‌నగర్, కొత్తపేట ప్రాంతాల్లో నివాసముంటున్నట్లు సమాచారం. స్థానిక ఏసీపీ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సివుంది. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు చేర్చాలి

స్కూల్ వాహన డ్రైవర్లకు ఎస్పీ ఆదేశాలు

అనంతగిరి: విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు చేర్చే పూర్తి బాధ్యత సంబంధిత స్కూల్ బస్సు, ఆటో, జీప్ డ్రైవర్లపైనే ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లే వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు ప్రమాదాల బారిన పడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. వాహనాలు కండీషన్‌ను పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. డ్రైవర్ల అలవాట్లపై నిఘా పెట్టాలన్నారు. వ్యసనాలుంటే వెంటనే వారిని విధుల్లోనుంచి తొలగించాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తి దుర్మరణం

నందిగామ: ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన నందిగామ శివారులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నందిగామ ఎస్‌ఐ గోపాలక్రిష్ణ కథనం మేరకు.. చంద్రాయన్‌గూడకు చెందిన యాదగిరి(48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి బైక్‌పై శంషాబాద్ సమీపంలోని ఊట్‌పల్లిలో ఉంటున్న కూతురి ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి అక్కడికక్కడే చనిపోయాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం తెలిసింది. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

యాచారం: బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి.. ఓ యువతి అదృశ్యమైంది. ఇందుకు సంబంధించి యాచారం పోలీసుల తెలిపిన వివరాలు.. యాచారం గ్రామానికి చెందిన (19) ఓ యువతి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో.. బంధువులకు ఫోన్ చేయగా అక్కడకు సైతం చేరుకోలేదని తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు శుక్రవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడువు ముగుస్తోంది!



బొంపల్లిలో రైతుబీమా దరఖాస్తులు చేయిస్తున్న ఏఈఓ దుర్గాప్రసన్న

- 'రైతు బీమా' దరఖాస్తులకు నేడు ఆఖరు అవకాశం
- ఇప్పటికి నమోదైన రైతులు 8,301
- పెండింగ్‌లో మరో 1,521 మంది

దోమ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. అర్హత కలిగిన రైతులకు బీమా ప్రీమియాన్ని చెల్లిస్తూ కుటుంబానికి వారి కుటుంబాలకు అండగా నిలుస్తుంది. బీమా కలిగిన రైతులు ఏ కారణంతో మృతి చెందినా రూ.5 లక్షల బీమా సొమ్మును ఆ కుటుంబానికి నేరుగా అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పట్టాలు పొందిన రైతుల నుంచి వివరాలు సేకరించి బీమాను వర్తింపజేసేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నేటితో గడువు ముగియనుండడంతో దరఖాస్తు చేసుకోని అర్హులు వెంటనే చేసుకోవాలని సూచిస్తున్నారు. దోమ మండల వ్యాప్తంగా మొత్తం 14,980 మంది రైతులుండగా 8,301 మంది రైతులు ఎన్‌రోల్ అయ్యారు. పెండింగ్‌లో 1,521 మంది ఉన్నారు. అర్హత సాధించలేని రైతులు 5,158 మంది ఉన్నారని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

దరఖాస్తుకు కావల్సినవి

నూతన పట్టాలు పొందిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, నామినీ బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లను ఆయా క్లస్టర్ల ఏఈఓలకు అందించి నమోదు చేసుకోవాలి. ఏఈఓలు దరఖాస్తులను పూర్తి చేసి నెల రోజుల వ్యవధిలో బీమాకు సంబంధించిన బాండ్‌ను ఏఈఓలు రైతులకు అందిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పించాం. గ్రామాల్లోకి వెళ్లి నమోదు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని గ్రామాలలో సర్పంచ్‌లతో డప్పు చాటింపు చేయించాం. నేటితో దరఖాస్తుకు గడువు ముగుస్తుండడంతో ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారి వద్దకు వెళ్లి ఎన్‌రోల్ చేసేలా చర్యలు తీసతుకుంటున్నాం.

– దుర్గాప్రసన్న, ఏఈఓ, శివారెడ్డిపల్లి

ఎలాంటి రుసుం లేదు



రైతుబీమాకు అర్హులైన రైతులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలి. నేటితో గడువు ముగుస్తుంది. తక్షణమే వివరాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించి నమోదు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. నూతన పట్టా పాసుపుస్తకం వచ్చి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు ఈ బీమాకు అర్హులు.

– ప్రభాకర్ రావు, వ్యవసాయాధికారి, దోమ

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు!



డంపింగ్ యార్డుకు మంటలు అంటుకుని కమ్ముకున్న పొగ

- డంపింగ్ యార్డులో ఎగిసిన పడిన మంటలు, పొగ
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యకు ఈ చిత్రం పరాకాష్టగా నిలుస్తోంది. 28 వార్డుల నుంచి సేకరించిన చెత్తలో 70 శాతానికి పైగా.. ఇన్నాళ్ల పాటు కార్గో రోడ్డు పక్కన ఉన్న బిజాన్ గుట్టపై డంప్ చేస్తున్నారు. గుట్టలుగా పేరుకుపోయిన ఈ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీకి తరలిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం డంపింగ్ యార్డుకు మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున పొగ కమ్ముకుంది. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆందోళన చెందారు. చెత్తకు మున్సిపల్ సిబ్బంది నిప్పు పెట్టారా..? లేదా చెత్తలోని ఇతర వస్తువులు సేకరించేందుకు వచ్చిన వారు ఎవరైనా ఇలా చేశారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా అటు స్వచ్ఛమైన చెరువును కలుషితం చేయడంతో పాటు ఇటు పర్యావరణానికి ముప్పు కలిగించే ఇలాంటి ఘటనలపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.